క్లుప్తంగా

కుసుమూరులో పంటకోత ప్రయోగం



కుసుమూరులో పంటకోత ప్రయోగం చేస్తున్న అధికారులు

తెర్లాం: మండలంలోని కుసుమూరులో చెరకు పంటకోత ప్రయోగం శనివారం నిర్వహించారు. ఏఎస్‌ఓ వి. నారాయణరావు ఆధ్వర్యంలో గ్రామానికి చెందిన గొంగాడ ఈశ్వరరావు పొలంలో పంటకోత ప్రయోగం చేపట్టారు. ఈ సందర్భంగా ఏఎస్‌ఓ మాట్లాడుతూ, ఎకరాకు 35 టన్నులకు పైగా దిగుబడి వచ్చే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో వి.వైకుంఠరావు, సర్పంచ్ తెంటు సత్యంనాయుడు, వీఆర్‌ఓ, రైతులు పాల్గొన్నారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ



విద్యార్థికి స్టడీ మెటీరియల్ పంపిణీ చేస్తున్న హెచ్‌ఎం త్రినాథరావు

బాడంగి: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న దివ్యాంగ విద్యార్థులకు హెచ్‌ఎం ఎస్.త్రినాథరావు శనివారం స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. సాంఘికశాస్త్ర ఉపాధ్యాయురాలు దమలపాటి శారద ఆర్థికసాయంతో మెటీరియల్ సమకూర్చినట్లు హెచ్‌ఎం తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కొల్లి ఈశ్వరరావు, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

చురుగ్గా సీసీ రోడ్డు నిర్మాణ పనులు



సీసీ రోడ్డు నిర్మాణ పనులు పరిశీలిస్తున్న ఎంపీడీఓ రఘునాథాచారి

సంతకవిటి: మండలంలోని వాల్తేరు గ్రామంలో చురుగ్గా సీసీ రోడ్డు నిర్మాణ పనులు జరుగుతున్నాయి. దాదాపు రూ.6 లక్షల అంచనా వ్యయంతో జరుగుతున్న రోడ్డు పనులను ఎంపీడీఓ ఎస్.రఘునాథాచారి శనివారం పరిశీలించారు. పనుల్లో నాణ్యత ఉండేలా జాగ్రత్త వహించాలని సూచించారు. కార్యక్రమంలో కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ జి.స్వామినాయుడు, వైస్ ఎంపీపీ పావని తదితరులు పాల్గొన్నారు.

రెండు పూటలా పనులు చేయాలి



వేతనదారులకు సూచనలిస్తున్న ఏపీఓ సాయిరాం

రాజాం సిటీ: వేతనదారులు తమకు ఇచ్చిన కొలతల ప్రకారం రెండు పూటలా పనులు చేస్తే గిట్టుబాటు అయ్యే వేతనం లభిస్తుందని ఏపీఓ కె.సాయిరాం తెలిపారు. మండల పరిధిలోని వీఆర్‌అగ్రహారం గ్రామంలో జరుగుతున్న ఉపాధి పనులను ఆయన శనివారం పరిశీలించారు. అనంతరం వేతనదారుల మస్తర్లు చూసి, పలు సూచనలు చేశారు. సక్రమంగా పనిచేస్తే రోజుకు రూ.257 వేతనం లభిస్తుందన్నారు. జాబ్ కార్డు ఉన్నవారు మాత్రమే పనులకు హాజరు కావాలని, పని ప్రదేశంలో తాగునీరు, ప్రథమ చికిత్స కిట్, టెంట్ అందుబాటులో ఉంచుకోవాలన్నారు. ఆయన వెంట డీఆర్‌పీ కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మునగమొక్కల పంపిణీ



మహిళలకు మునగ మొక్కలు పంపిణీ చేస్తున్న ఏపీఎం మంగమ్మ, సర్పంచ్ వెంకటేశ్వరరావు

రేగిడి: మండలంలోని లక్ష్మీపురం గ్రామంలో స్వయంశక్తి సంఘాల మహిళలకు సర్పంచ్ కెంబూరి వెంకటేశ్వరరావు చేతులమీదుగా శనివారం మునగమొక్కలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏపీఎం టి.మంగమ్మ మాట్లాడుతూ కూరగాయల సాగుకు సంఘాల్లోని మహిళలంతా ఆసక్తి చూపాలన్నారు. ప్రభుత్వ సదుపాయాలు, బ్యాంకు రుణాలు సద్వినియోగం చేసుకుని పెరట్లో కూరగాయలు పండించుకుని, అదనపు ఆదాయం సంపాదించుకోవచ్చన్నారు. లక్ష్మీపురం నర్సరీలో 5 వేలు, ఖండ్యాం నర్సరీలో 5 వేల మునగ మొక్కలు పంపిణీ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో సీసీ విమలకుమారి, సీఎఫ్ పార్వతి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల ప్రతిభ

బొబ్బిలి: ఇటీవల నిర్వహించిన క్యాట్ నాలెడ్జ్ అసెస్మెంట్ టెస్ట్ ఒలింపియాడ్‌లో శ్రీచైతన్య హైస్కూల్‌కు చెందిన 145 మంది విద్యార్థులు ప్రతిభ కనబర్చినట్టు ప్రిన్సిపాల్ కె.మురళీధర్, వైస్ ప్రిన్సిపాల్ చంద్రశేఖర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులకు నగదు బహుమతులతో పాటు బంగారు పతకాలు అందించారని పేర్కొన్నారు.

పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు



ఇంటింటికీ వెళ్లి, ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్సీ విక్రాంత్, ఎమ్మెల్యే జోగులు



లబ్ధిదారుకు బుక్‌లెట్ అందజేస్తున్న డిప్యూటీ సీఎం రాజన్నదొర

- 'గడప గడపకు మన ప్రభుత్వం'లో మంత్రి రాజన్నదొర, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, ఎమ్మెల్యే కంబాల జోగులు

రేగిడి: కుల, మత, రాజకీయ పార్టీలకు అతీతంగా అర్హులైన ప్రతిఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానిదేనని ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, ఎమ్మెల్యే కంబాల జోగులు అన్నారు. మండలంలోని ఆర్.ఆమదాలవలస గ్రామంలో శనివారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ఆయా నేతలకు గ్రామస్తులు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే కలిసి ఇంటింటికీ వెళ్లి, మూడున్నరేళ్లుగా ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులు అమలు చేస్తున్న పథకాలు వివరించారు. ఏవైనా సమస్యలున్నా, అర్హులై ఉండి ఎవరికైనా పథకాలు అందకపోయినా వెంటనే తెలియజేయాలని కోరారు. ఈ క్రమంలో పలువురు చిన్నచిన్న సమస్యలను వారి దృష్టికి తీసుకురాగా, వాటిని సత్వరమే పరిష్కరించాలని అధికారులను సదరు నేతలు ఆదేశించారు. గతంలో టీడీపీ హయాంలో ఏ ఒక్క పథకం కావాలన్నా, అభివృద్ధి పనులు జరగాలన్నా మండల కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయాలు, అధికారులు, నేతల చుట్టూ కాళ్లరిగేలా తిరగాల్సిన దుస్థితి ఉండేదన్నారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదన్నారు. ఏ ఒక్క సమస్య పరిష్కారం కావాలన్నా, పథకం కావాలన్నా సచివాలయంలో దరఖాస్తు చేసుకున్న కొన్నిరోజులకే న్యాయం జరుగుతోందన్నారు. రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధి, ప్రజా సంక్షేమమే ధ్యేయంగా అహర్నిశలు శ్రమిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే అన్ని వర్గాలకు సమన్యాయం జరుగుతోందన్నారు. వచ్చే ఎన్నికల్లోనూ ఇదే ప్రభుత్వాన్ని ఆశీర్వదించి, సీఎం జగన్‌ను మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలని ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ కోరారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు టి.అచ్చెన్నాయుడు, వి.జగన్‌మోహనరావు, సర్పంచ్ కె.అప్పయ్య, రేగిడి పీఏసీఎస్ అధ్యక్షుడు ఎన్.పెంటన్నాయుడు, ఎంపీడీఓ జి.కాశీవిశ్వనాథరావు, తహసీల్దార్ టి.కల్యాణ చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు మెచ్చేలా పాలన.. : ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర

మెంటాడ: రాష్ట్రంలో ప్రజలు మెచ్చేలా పాలన సాగుతోందని డిప్యూటీ సీఎం, గిరిజన శాఖా మంత్రి పీడిక రాజన్నదొర అన్నారు. మండలంలోని రాబందలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలు ఎలా అందుతున్నదీ ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేసిన ఏకైక సీఎం జగన్ మోహన్‌రెడ్డి అని కొనియాడారు. సచివాలయ వ్యవస్థతో గాంధీ కలలుగన్న గ్రామస్వరాజ్యం తీసుకువచ్చాడని చెప్పారు. అన్ని వర్గాల సంక్షేమమే ముఖ్యమంత్రి లక్ష్యమని చెప్పారు. అంతకుముందు రాజన్నదొరకు గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఎంపీపీ రెడ్డి సన్యాసినాయుడు, వైస్ ఎంపీపీ సారిక ఈశ్వరరావు, మండల పార్టీ నాయకులు లెంక రత్నాకర్, రెడ్డి రాజప్పలనాయుడు, మెంటాడ, జక్కువ పీఏసీఎస్‌ల అధ్యక్షులు తాడ్డి రామచంద్రరావు, రెడ్డి అప్పారావు, సర్పంచ్ తవుడు, చొక్కాకు సన్యాసినాయుడు, ఎంపీడీఓ త్రివిక్రమ్, తహసీల్దార్ ఆదిబాబు, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో పారదర్శక పాలన



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు



సమావేశానికి హాజరైన సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు

- ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు

రామభద్రపురం: ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి సారథ్యంలో రాష్ట్రంలో పారదర్శక పాలన కొనసాగుతోందని ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు అన్నారు. తన 40 ఏళ్ల రాజకీయ జీవితంలో ఇంత మంచి పరిపాలన ఎన్నడూ చూడలేదని చెప్పారు. శనివారం స్థానిక టీవీఆర్ ఫంక్షన్ హాల్‌లో ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు ఆధ్వర్యంలో పార్టీ మండల విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జగనన్న పాలన దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలు అందుతున్నాయా, లేదా అని అడగడం గొప్ప విషయమన్నారు. జన్మభూమి కమిటీల పేరుతో దోచుకున్న చంద్రబాబు లాంటి నాయకుడ్ని తరిమికొట్టాలన్నారు. సంక్షేమ పాలన అందిస్తున్న జగనన్నను రానున్న ఎన్నికల్లో మరోసారి గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. దివంగత ముఖ్యమంత్రి ఎన్‌టీ రామారావుకు అప్పట్లో 41 నుంచి 45 శాతం ఓట్లు వస్తే 2019లో వైఎస్సార్‌సీపీకి 51 శాతం ఓట్లు వచ్చాయని తెలిపారు. త్వరలో జరగనున్న ఎన్నికల్లో 175 స్థానాల్లో గెలుస్తామని జోస్యం చెప్పారు. నియోజకవర్గంలో టీడీపీ తరఫున పోటీలో ఎవరు ఉన్నారో కూడా తెలియడం లేదని ఎద్దేవా చేశారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలంతా ఐకమత్యంగా ఉంటూ పార్టీ విజయానికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు అప్పికొండ సరస్వతి, ఏఎంసీ చైర్మన్ ఒమ్మి శ్రీనివాసరావు, పార్టీ బొబ్బిలి మండల అధ్యక్షుడు శంబంగి వేణుగోపాలనాయుడు, యువ నాయకుడు శంబంగి శ్రీకాంత్, బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ డబ్ల్యూఎస్ రాయులు, మండల సచివాలయ కన్వీనర్ చింతల సింహాచలం నాయుడు, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి

- ఎమ్మెల్యే కంబాల జోగులు



రేగిడి: రోడ్డు భద్రతా వారోత్సవాల ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే జోగులు, ఎస్‌ఐ శ్రీనివాసరావు



రాజాం సిటీ: హెల్మెట్ వాడకంపై అవగాహన కల్పిస్తూ బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు



రామభద్రపురం: అవగాహన ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు, పోలీసులు

రేగిడి: ప్రతిఒక్కరూ రోడ్డు భద్రతా నియమాలు పాటించి, ప్రమాదాల నివారణకు సహకరించాలని ఎమ్మెల్యే కంబాల జోగులు అన్నారు. రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా స్థానిక ఉంగరాడమెట్ట వద్ద శనివారం అవగాహన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వాహనాలతో రోడ్లపైకి వచ్చేవారు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఆటోలు, వ్యాన్‌లు, క్యాబ్‌లలో పరిమితికి మించి ప్రయాణికులు ఉండకూడదని, ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని కోరారు. ఎస్‌ఐ శ్రీనివాసరావు మాట్లాడుతూ సెల్‌ఫోన్ మాట్లాడుతూ, మద్యం తాగి వాహనాలు నడపకూడదన్నారు. మైనర్లకు వాహనాలు ఇవ్వకూడదన్నారు.

హెల్మెట్ తప్పనిసరి..

రాజాం సిటీ: ద్విచక్ర వాహనదారులంతా తప్పనిసరిగా హెల్మెట్ ధరించి వాహనాలు నడపాలని రాజాం టౌన్ సీఐ కె.రవికుమార్ సూచించారు. రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా పట్టణంలో బైక్ ర్యాలీ నిర్వహించి, హెల్మెట్ వాడకంపై అవగాహన కల్పించారు. వివిధ పనులపై బయటకు వెళ్లేవారంతా తొందరలో పడి హెల్మెట్ మర్చిపోతున్నారని, ఈసారి నుంచి అలా మరువవద్దని హితవు పలికారు. కార్యక్రమంలో ఎస్‌ఐలు పి.నీలావతి, పి.సూర్యకుమారి, వీబీ రామకృష్ణ, వై.రవికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

వంగర: రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా మండలంలోని మద్దువలస గ్రామంలో శనివారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రమాదాల నివారణకు పాటించాల్సిన జాగ్రత్తలను ఎస్‌ఐ బుదుమూరు లోకేశ్వరరావు వివరించారు.

అవగాహన ర్యాలీ

రామభద్రపురం: రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా చొక్కాపు రామినాయుడు జూనియర్ కళాశాల విద్యార్థులు మండల కేంద్రంలో అవగాహన ర్యాలీ చేపట్టారు. అనంతరం గాంధీ జంక్షన్ వద్ద మానవహారంగా ఏర్పడ్డారు. కార్యక్రమంలో ఎస్సై సురేంద్రనాయుడు, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

జెండర్ రిసోర్స్ సెంటర్ సేవలు సద్వినియోగం చేసుకోండి



మాట్లాడుతున్న మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు అరుణకుమారి

రాజాం: మండల సమాఖ్య కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన జెండర్ రిసోర్స్ సెంటర్ సేవలను సద్వినియోగం చేసుకోండి అని మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు సామంతుల అరుణకుమారి కోరారు. శనివారం స్థానిక జెండర్ రిసోర్స్ సెంటర్ వద్ద ఆమె మీడియాతో మాట్లాడుతూ చిన్నప్పటి నుంచే మగపిల్లలతో సమానంగా ఆడపిల్లలను పెంచాలని సూచించారు. సమాజంలో స్త్రీ, పురుష వ్యత్యాసాలు రానివ్వకూడదన్నారు. ప్రతిఒక్కరూ మహిళలను గౌరవించాలన్నారు. వరకట్న, లైంగిక వేధింపులకు గురవుతున్న మహిళలు సహాయం కోసం జెండర్ రిసోర్స్ సెంటర్‌ను ఆశ్రయిస్తే సహాయం అందించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎఫ్‌పీఓ ఏపీఎం కె.హేమలత తదితరులు పాల్గొన్నారు.

రైతుబజార్ల ఏర్పాటుకు చర్యలు

- ఏఎంసీ చైర్మన్ ఒమ్మి శ్రీనివాసరావు



మాట్లాడుతున్న ఏఎంసీ చైర్మన్ శ్రీనివాసరావు

రామభద్రపురం: రైతులకు మద్దతు ధర కల్పనే లక్ష్యంగా బొబ్బిలి వ్యవసాయ మార్కెట్ కమిటీ పరిధిలో రైతుబజార్ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని బొబ్బిలి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఒమ్మి శ్రీనివాసరావు అన్నారు. మండల కేంద్రంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, చెక్‌పోస్టులు మరింత బలోపేతం చేయడంతో పాటు రైతులకు అవసరమైన మార్కెట్ యార్డులు ఏర్పాటుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామని తెలిపారు. సమావేశంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ సభ్యులు మర్రాపు త్రినాథ, రామభద్రపురం వ్యవసాయ సహకార పరపతి సంఘం చైర్మన్ కిర్ల చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ఎంపీ పరామర్శ



సూరపునాయుడు యోగక్షేమాలు అడిగి తెలుసుకుంటున్న ఎంపీ, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే తదితరులు

రాజాం: పట్టణానికి చెందిన శ్రీకాకుళం జిల్లా ఓపెన్ స్కూల్ కో-ఆర్డినేటర్ దూబ సూరపునాయుడును విజయనగరం ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ శనివారం కలిసి పరామర్శించారు. ఇటీవల ఆయన విశాఖపట్నంలో గుండె సంబంధిత ఆపరేషన్ చేయించుకోగా, ఆయనను రాజాంలో కలిసి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఎమ్మెల్యే కంబాల జోగులు, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, వైఎస్సార్ సీపీ టౌన్ కన్వీనర్ పాలవలస శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

గానాల రామ్మూర్తికి ఘన నివాళులు



గానాల రామ్మూర్తి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న విశ్వబ్రాహ్మణ సంఘ నేతలు

బొబ్బిలి: ఉమ్మడి మద్రాసు, ఏపీ ప్రభుత్వంలో ఎమ్మెల్సీగా సేవలందించిన విశ్వబ్రాహ్మణ నాయకుడు గానాల రామ్మూర్తి 131వ జయంతిని శనివారం స్థానిక రైల్వే స్టేషన్ జంక్షన్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ సంఘ జిల్లా అధ్యక్షుడు ముగడ వెంకటరమణ, యువజన విభాగం ఆర్గనైజింగ్ కార్యదర్శి ములగపాటి బంగార్రాజు, నాయకులు తాగుతూరి అచ్యుతరావు, అరటికట్ల హరిబాబు, ఎస్. త్రినాథ, జి. త్రినాథ, న్యాయవాది తుమరాడ గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

రేగిడి: మండలంలోని చాటాయవలస గ్రామంలో ప్రకృతి వ్యవసాయంపై రైతులకు శనివారం అవగాహన కల్పించారు. వ్యవసాయాధికారి జి. మురళీకృష్ణ, ప్రకృతి వ్యవసాయం ట్రైనీ మాస్టర్ సీహెచ్ శారద రైతులకు ప్రకృతి వ్యవసాయ పద్ధతులు వివరించి, రైతుల సమక్షంలో 500 కిలోల ఘన జీవామృతం తయారు చేసి, చైతన్యం కలిగించారు. ప్రతిఒక్కరూ ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణం కోసం ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో వ్యవసాయం చేయాలన్నారు. తక్కువ ఖర్చుతో తయారయ్యే ఘన, ద్రవ జీవామృతాలు తయారు చేసుకుని, పంటలకు వినియోగించాలని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ కె.గోవిందరావు, ఎంపీటీసీ పి.అప్పలనాయుడు, అగ్రికల్చర్ అసిస్టెంట్ కె.శ్రీనివాసరావుపాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు

- జెడ్పీ డిప్యూటీ సీఈఓ రాజ్‌కుమార్



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీ డిప్యూటీ సీఈఓ రాజ్‌కుమార్

తెర్లాం: రానున్న వేసవిని దృష్టిలో ఉంచుకుని గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని మండల ప్రత్యేకాధికారి, జెడ్పీ డిప్యూటీ సీఈఓ కె.రాజ్‌కుమార్ అన్నారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ శంబంగి రామకృష్ణ అధ్యక్షతన వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తాగునీటి సరఫరాకు అవసరమైన నిధుల మంజూరుకు ముందుగా ప్రతిపాదనలు సిద్ధం చేసుకోవాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈకి సూచించారు. మండలంలో పెండింగ్‌లో ఉన్న ఆర్బీకే, వెల్‌నెస్ సెంటర్లు, సచివాలయాల నిర్మాణాలు పూర్తి చేయాలని మండల ఇంజినీరింగ్ అధికారి ఆర్నిపల్లి రాజశేఖర్‌ను ఆదేశించారు. అలాగే సఖీ గ్రూపుల ఏర్పాటు, వాటి నిర్వహణకు మహిళా పోలీసులు, ఆశ వర్కర్లు, ఏఎన్‌ఎంల సహకారం తీసుకోవాలని ఐసీడీఎస్ తెర్లాం సెక్టార్ సూపర్‌వైజర్ ఉషారాణికి సూచించారు. అనంతరం ఇళ్ల నిర్మాణాలు, ధాన్యం కొనుగోళ్లు, తదితర అంశాలపై ఆరా తీశారు. కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ ఎం. వెంకటేశ్వరరావు, ఏఓ జి.సునీల్‌కుమార్, ఎంఈఓ త్రినాథరావు,తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రికి రుణపడి ఉంటాం...

మెంటాడ: ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డికి వెలమ సంక్షేమ సంఘ సభ్యులంతా రుణపడి ఉంటామని స్టేట్ డైరెక్టర్ రెడ్డి గౌరి అన్నారు. శనివారం ఆమె సాక్షితో మాట్లాడుతూ, తనకు రెండోసారి కొప్పల వెలమ సంక్షేమ డైరెక్టర్‌గా నియమించినందుకు మంత్రులు పీడిక రాజన్నదొర, బొత్స సత్యనారాయణ, జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీను, ఎంపీపీ రెడ్డి సన్యాసినాయుడు, జెడ్పీటీసీ సభ్యుడు లెంక సన్యాసప్పలనాయుడులకు ధన్యవాదాలు తెలిపారు.

చిరు వ్యాపారాలతో అభివృద్ధి చెందాలి

బొబ్బిలి రూరల్: చిరువ్యాపారాల ద్వారా మహిళలు అభివృద్ధి చెందాలని ఫుడ్‌ప్లానింగ్ యాంకర్ పర్సన్ జ్యోత్స్న సూచించారు. శనివారం స్థానిక వెలుగు కార్యాలయంలో మహిళలతో చిరు వ్యాపారాలపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, వ్యాపారాలతో మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించాలని సూచించారు. సమావేశంలో ఏపీఎం పీపీ స్వామి, తదితరులు పాల్గొన్నారు.

కొత్త మెనూ అమలు చేయాలి

తెర్లాం: ప్రభుత్వ పాఠశాలల్లో జగనన్న గోరుముద్ద పథకంలో భాగంగా కొత్త మెనూ అమలు చేయాలని ఎంపీడీఓ శంబంగి రామకృష్ణ ఆదేశించారు. మండలంలోని లోచర్ల పాఠశాలను శనివారం సందర్శించి, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఆయనతో పాటు పంచాయతీ కార్యదర్శి ఇందిర, తదితరులు ఉన్నారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

వంగర: మండల పరిధిలోని అరసాడ జంక్షన్ వద్ద అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను శనివారం సీజ్ చేసినట్లు ఎస్‌ఐ బుదుమూరు లోకేశ్వరరావు తెలిపారు. నాగావళి నది నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్నట్లు అందిన సమాచారం మేరకు ట్రాక్టర్‌ను పట్టుకుని, సీజ్ చేసినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే కేసులు



డ్రైవర్లకు సూచనలిస్తున్న ఎస్‌ఐ లోకేశ్వరరావు

వంగర: వాహనదారులు నిబంధనలు అతిక్రమిస్తే కేసులు నమోదు చేస్తామని ఎస్‌ఐ బుదుమూరు లోకేశ్వరరావు హెచ్చరించారు. స్థానిక పోలీస్‌స్టేషన్ ఆవరణలో వివిధ వాహన డ్రైవర్లతో శనివారం సమావేశమైన ఆయన పలు సూచనలు చేశారు. అధిక లోడు, పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకుని వాహనాలు నడపరాదన్నారు. పరిమితికి మించి ప్రయాణికులను తీసుకువెళ్తున్న ఇద్దరు ఆటోడ్రైవర్లపై శనివారం కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

గృహ ఆధారిత విద్య అందించాలి

- ఎంఈఓ త్రినాథరావు



నందబలగలో ప్రత్యేక అవసరాలు గల విద్యార్థినిని పరిశీలిస్తున్న ఎంఈఓ త్రినాథరావు

తెర్లాం: ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు గృహ ఆధారిత విద్యను సహిత విద్య ఉపాధ్యాయులు ఇంటివద్దే అందించాలని మండల విద్యాశాఖాధికారి జె.త్రినాథరావు అన్నారు. సహిత విద్యా విభాగం ద్వారా 'గృహ ఆధారిత విద్య – పరిశీలన' కార్యక్రమంలో భాగంగా మండలంలోని నందబలగ గ్రామానికి చెందిన ఏడో తరగతి విద్యార్థిని గంట నాగమణి ఇంటికి శనివారం వెళ్లి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎప్పటికప్పుడు విద్యార్థిని ఇంటికి వెళ్లి శారీరక, మానసిక పరిస్థితిని అడిగి తెలుసుకోవాలని మండల ఐఈఆర్‌టీ సూర్యారావుకు సూచించారు.

లోక్ అదాలత్‌ను విజయవంతం చేయండి

- సీనియర్ సివిల్ జడ్జి ఎం.బాబు



సమావేశంలో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి బాబు

రాజాం సిటీ: పట్టణంలో ఫిబ్రవరి 11వ తేదీన జరనున్న జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయండి అని సీనియర్ సివిల్ జడ్జి ఎం.బాబు కోరారు. శనివారం స్థానిక కోర్టు సముదాయంలో న్యాయవాదులు, రెవెన్యూ, బ్యాంకు, పోలీస్ సిబ్బందితో సమావేశమైన ఆయన రాజీయే రాజమార్గమని సంబంధిత కక్షిదారులకు అవగాహన కల్పించి, కేసుల విషయంలో రాజీకి వచ్చేలా చూడాలన్నారు. రాజీకి అనుకూలమైన సివిల్, క్రిమినల్, ప్రీ-లిటిగేషన్ కేసులన్నీ ఇరుపార్టీల అంగీకారంతోనే పరిష్కరించనున్నామని తెలిపారు. సివిల్ కేసులు పరిష్కారమైతే కోర్టు ఫీజు వాపసు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో జూనియర్ సివిల్ జడ్జి పీఎస్‌వీబీ కృష్ణసాయితేజ, బార్ అసోసియేషన్ రాజాం కార్యదర్శి సీహెచ్ శంకరరావు, ఏజీపీ ఎస్. పోలారావు, రాజాం టౌన్, రూరల్ సీఐలు కె.రవికుమార్, హెచ్.ఉపేంద్ర పాల్గొన్నారు.

జగనన్న కాలనీల్లో మౌలిక సదుపాయాలు

- మండల ప్రత్యేకాధికారి వెంకటేశ్వరరావు

మెంటాడ: రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న జగనన్న కాలనీల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నట్లు మండల ప్రత్యేకాధికారి డి. వెంకటేశ్వరరావు అన్నారు. మండలంలోని బడేవలసలో శనివారం హౌసింగ్ డే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ డేవిడ్, వైఎస్సార్‌సీపీ నాయకులు మీసాల గురునాయుడు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం..

బొబ్బిలి రూరల్: లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలని హౌసింగ్ డీఈఈ పి.అప్పయ్య సూచించారు. మండలంలో కమ్మవలసలో హౌసింగ్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు, స్థానిక ప్రజాప్రతినిధులతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు.

ఉగాది లోగా పూర్తి చేయాలి..

తెర్లాం: జగనన్న ఇళ్లను ఉగాదిలోగా పూర్తిచేయాలని ఎంపీడీఓ శంబంగి రామకృష్ణ అన్నారు. మండలంలోని లోచర్లలో హౌసింగ్‌డే కార్యక్రమం నిర్వహించి, లబ్ధిదారులకు సూచనలు చేశారు. కార్యక్రమంలో మండల గృహనిర్మాణ శాఖ ఏఈ ఎం.వెంకటేశ్వరరావు, వర్క్ ఇన్‌స్పెక్టర్లు, అధికారులు ఉన్నారు.

త్వరగా పూర్తి చేయాలి

బాడంగి: జగనన్న ఇళ్లను త్వరగా పూర్తి చేయాలని ఎంపీడీఓ కె.అక్కారావు అన్నారు. మండలంలోని గజరాయునివలస, కామన్నవలస గ్రామాలలో హౌసింగ్ డే కార్యక్రమంలో భాగంగా లబ్ధిదారులను కలిసి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ ఎస్.సత్యం, విద్యుత్, పీఆర్ ఏఈలు శ్రీనివాసరావు, రమేష్, ఏపీఓ లక్ష్మీపతిరాజు, ఏపీఎం భాగ్యలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

సంతకవిటి: మండలంలోని మిర్తివలస గ్రామంలో హౌసింగ్ డే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ ఎస్.రఘునాథాచారి గ్రామంలో నిర్మాణ దశలోని జగనన్న కాలనీ ఇళ్ల నిర్మాణాలను పరిశీలించి, పలు సూచనలు చేశారు. సర్పంచ్ భూపతినాయుడు, ఎంపీటీసీ రమణ ఉన్నారు.

రాజాం: సకాలంలో ఇళ్ల నిర్మాణాలు చేపట్టాలని జగనన్న హౌసింగ్ కాలనీ లబ్ధిదారులకు ఎంపీడీఓ బాసూరి శంకరరావు సూచించారు. హౌసింగ్ డే కార్యక్రమంలో భాగంగా మండలంలోని వీఆర్‌అగ్రహారం గ్రామంలో నిర్మాణ దశలోని జగనన్న కాలనీ ఇళ్ల నిర్మాణాలను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్‌డీఓ శ్రీనివాసరావు, హౌసింగ్ ఏఈ వేణుగోపాలరావు తదితరులు పాల్గొన్నారు.